


# నిర్భాగ్యుడు

## ఎం.వి. కల్యాణి

**వేసవికాలపు** ఎండ మలమలా మాడ్చేస్తున్నది. తారు రోడ్డు పై తారు అక్కడక్కడ ఉబ్బిపోయి, తెలియక కాలు పెడితే నిప్పంటుకున్నట్లు బొబ్బ లెక్కుతున్నది. పాదరక్షలు లేనివాళ్లు రోడ్డు ప్రక్కగా నడుస్తున్నారు. హోటల్లో కాలిన పెనం పైన అట్టు 'చుంయ్' అని శబ్దం చేస్తూన్నది. రోడ్డు ప్రక్కనున్న 'దానియేలు' నోరూరుతున్నది. సూర్యుడు నెత్తిమీద గునపపు పోటులా కిరణాలతో పొడుస్తున్నాడు. పాత గొడుగు పట్టుకొని రోడ్డుప్రక్క కూర్చొని ఉన్నాడు 'దానియేలు'. కత్తి, ఆరె, కొన్ని పాతతోళ్ళు, రబ్బరు టైరు ముక్కలు ముందు వేసుకొని రోడ్డుమీద నడిచేవారి పాదాలవంక తదేక దీక్షతో చూస్తున్నాడు.

*అన్నిటికన్న బలవత్తరమైనది ఆశ. ఏది ఏమైనా ఆశమాత్రం చావు లేనిది. మానవుడు ఆశా జీవి. కాదనడం కష్టం. కాని బ్రతికి ఉంటే కదా, ఆశ మానవుని లోబరచు కొనగలిగేది?*

---

"ఏమోయ్! ఈ చెప్పుకు ఉంగటం, ఎదురు వారు కుడతావా?"

"కుడతాను."

"ఏం యివ్వమంటావ్?"

"మీకు తోచినంత యివ్వండి బాబు."

"అదేం మాట. ఎంత యివ్వమంటావో చెప్పు."

కుట్టిన తరువాత నిష్ఠూరం పనికిరాదు. ముందుగా చెప్పు అంటున్నాడు పెద్దమనిషి. దానియేలు ఆయన మాటలు లెక్కచెయ్యకుండా చెప్పుపై నీళ్ళు చల్లటం ప్రారంభించాడు.

"ఏంకావాలో చెప్పి మరీ కుట్టు" అన్నాడు ఆ పెద్దమనిషి.

"బేడ యిప్పించండి బాబు. గట్టిగా నాల్గు నెలలు ఉండేటట్టు కుడతా."

"ఓయబ్బో! బేడా కావాలా, ముండమోపి ఉంగటం, ఎదురువారు కుట్టేనందుకు?"

"ఎన్ని బేడలైతే కడుపు నిండుతుంది బాబూ? ఏదో మీకు తోచినంత యివ్వండి" అంటూ కుట్టు ప్రారంభించాడు దానియేలు.

"నేను అర్ధణాకన్నా అధికంగా ఓ పైసా కూడా ఇవ్వను. ఇష్టమైతేనే కుట్టు. లేకపోతే చెప్పు ఇలా పారేయ్" అంటూ బేరాన్ని ఖండితంగా చెప్పాడు పెద్దమనిషి, ఆటలో పాయింటును



గరళ కంఠుడు

చిత్రం— 'రక్తరేఖ' (సికిందరాబాదు)

నిర్ణయించే అంపైర్ లాగా.

"అట్టంటే ఎలా బాబూ? ఓ అణా కాను యిప్పించండి. చెప్పు తడిపా. ఈ ఎండలో ఎక్కడి కెళతారు?"

"నీ ఇష్టమైతే అర్ధణాకు కుట్టు. లేకుంటే చెప్పు ఇలా పారేయ్. వెధవ బేరం. ఆలస్యమవుతూంది" అంటూ కసురుకున్నాడు పెద్దమనిషి.

"గిట్టదు బాబయ్యా" అంటూ దానియేలు నిరాశతో చెప్ప క్రిందవేశాడు.

2

కడుపులో పేగులు గుర్రుపెట్ట సాగాయి. దాహం విపరీతంగా వేస్తున్నది. ఆకలి అంతకంటేనూ. ఏది ముందు అని రెండూ పోటీ పడిన ట్లుంది. రాత్రి నూకలు లేక మంచినీళ్లతో పడుకున్నాడు దానియేలు. ఉదయం నుంచి ఇంతవరకు ఒక్క బేడా డబ్బులు కూడా దొరకలేదు. వచ్చిన ఒక రిద్దరూ బేరం కుదరక, దానియేలు కర్మం కొద్దీ వెళ్లిపోయారు. రోడ్డుపై జనం పల్చబడసాగారు. ప్రక్కనే ఉన్న కొళాయి వద్దకు వెళ్లి కడుపునిండా నీరుత్రాగి 'బేవు' మంటూ త్రేనుస్తూ వచ్చి కూర్చున్నాడు. పట్టెపొట్ట కావటంచేత నీళ్లు కడుపులో 'లప్‌డప్' అంటూ కదులుతున్నాయి.

గొడుగు క్రింద కూర్చుని చెమట తుడుచుకుంటూన్నాడు దానియేలు. దూరంనుండి వస్తూన్నాడు ఏశోబు, తండ్రి సంపాదనతో ఏదైనా తినిపిస్తాడని.

"అయ్యా! ఆకలేస్తుందే! ఓ అనా వుంటే ఇవ్వవే. మామిడికాయ కొనుక్కుంటా."

మామిడికాయ మాట వినేసరికి పండ్లు జివ్వున లాగాయి దానియేలుకు.

"పొద్దుటాలనుండి చూస్తూన్నా. ఒక్క కానీ కూడా రాలేదు రా. ఏ మారాజైనా జోడు బాగుచేయించుకుంటే ఇస్తాను" అన్నాడు దానియేలు.

దానియేలు హృదయం ద్రవించింది. తెలియకుండా కనుగొలకుల్లో అశ్రుబిందువులు వచ్చి చెమటతో కలిసిపోయాయి.

ఈలాంటి ఛండాలపు దినాలు తన జీవితంలో చాలా చూచాడు దానియేలు. కాని ఏశోబు ఆకలికి ఓర్వలేడు. పసికందు. వాడికి కావలసింది అణా కాసు. పల్లెటూర్లో అయితే ఏ కాపుఇంటికి వెళ్లినా ఇంత 'సంకటిముద్ద' పెడతారు. 'లేదు' అనే శబ్దం రాదప్పట. కాని ఈలాంటి మహా పట్నంలో నిర్భాగ్యం గొడాలించే దిక్కెవ్వరు? ఎవరికి తీరిక ఉంది? తీరికఉన్నా తీర్చే నాథుడెవరు?

ఎండ తీవ్రం కొద్దిగా తగ్గింది. తిరిగి రోడ్డుపై జనసంచారం ప్రారంభమైంది.

"ఏరా జోడుకు క్రింద అట్టవేసి కుడతావా?"

"కుడతాను బాబు."

"ఏం ఇవ్వమంటావ్?"

"ఓ అర్ధరూపాయ్ ఇవ్వండి బాబూ."

"అర్ధరూపాయి చాలా?"

"అదేంటి బాబు, అట్లాగంటారు? తామెర గనిదేముంది. క్రొంజోడు కొత్తది అయిదు రూపాయ లమ్ముతూంది. మామూలు తోలు జోడు మూడు రూపాయలు. అడుగున బారట్ట వేసి కుడితే కనీసం అర్ధరూపాయి యివ్వకుంటే మే మెలా బ్రతుకుతాం బాబూ? తోలు ఖరీదు తను లెరగంది కాదు."

"పావలా ఇస్తా. ఇష్టమైతే కుట్టు. కష్టమైతే మానుకో" అంటూ నడవసాగాడు ఆ పెద్దమనిషి.

దానియేలు గుండెల్లో రైళ్లు పరుగెత్త సాగాయి. ఆ పావలా బేరంకూడా పోతుందేమో అన్న భయంతో "బాబు రండి" అంటూ కేకలు వేసి చేతులు కొట్టి పిలిచాడు.

"మొదటే ఒప్పుకుంటే ఎంత బావుణ్ను. నీకేం తక్కువ ఇస్తానా?" అంటూ ప్రక్కన నిలుచున్నాడు ఆ పెద్దమనిషి.

పావలాతో ఆరోజుకు దుకాణం మూశాడు దానియేలు. బేడాపెట్టి, చిత్తూరు మామిడికాయ కొని, సగం తాను తిని మిగిలింది ముట్మతో సహా ఏశోబు కిచ్చాడు. ఆప్యాయంగా దాన్ని అరగంట చీకి, చేతులు నాకి, గుడ్డకు తుడుచుకున్నాడు ఏశోబు. కొళాయి వద్ద కడుపునిండా నీరు త్రాగారు తండ్రి కొడుకు లిద్దరూ.

కర్మసాక్షి పడమటి కొండలోకినగంపోయాడు; కొండ చాటుచేసుకుని లోకాన్ని చూచి, ఓ చిన్న చిరునవ్వు నవ్వి మాయమయ్యాడు. శీతాంశుడు చల్లటి కిరణాలతో ఆహ్లాదకరంగా ఆకాశంలో అగుపించాడు. రోడ్డుపై జనం చిక్కబడి, ఇసక వేస్తే రాలనంతగా తయారయ్యారు.

రోడ్లప్రక్క విద్యుద్దీపాలు వెలిగాయి. సినిమాలు వదలారు. సినిమాకు తిరిగి వెళ్లేవారు; ఆఫీసునుంచి నడిచి ఇండ్లకు వెళ్లేవారు; నానా రకాలైనవారితో రోడ్లు సందడిగా ఉన్నాయి.

దానియేలు పాత తోళ్లమూట, చింపిరి గొడుగు, చిముగుల గోనె తీసుకొని ఇంటి వైపు నడుస్తున్నాడు. వెనక ఏశోబు వస్తూన్నాడు. కాఫీహోటళ్లు, పండ్లదుకాణాలు, బియ్యపుకొట్లు, మిఠాయిబండ్లు, మామిడిపళ్ళ రాసులు, సోడా బండ్లు, జనం, మోటార్లు, రిక్షాలు తప్పించుకొని నడుస్తూన్నాడు. నడుస్తూన్నాడేగాని, అతని శరీరం అతనికి స్వాధీనంలో లేదు. ఎంత నడిచినా కొండవీటి చేంతాళ్లా అంతూ పొంతూ లేదు రోడ్డుకు. కొంతదూరం పోయాక కొంత జనసమ్మర్దం తగ్గ నారంభించింది. మెయిన్ రోడ్డు దాటి ప్రక్కరోడ్డు పట్టుకున్నారు.

"అయ్యా! మిగిలిన బేడాకు యింటికేమైనా తీసికెళ్లదామే."

"ఏం వస్తవిరా? బేడకి."

"చిన్నవి అయితే రెండు, పెద్దదైతే ఒకటి వస్తాయి, మామిడి కాయలు" అన్నాడు ఏశోబు ఆప్యాయంగా.

బేడకి రెండు మామిడి పళ్లు కొని ఏశోబు చేతికిచ్చాడు దానియేలు. ఇల్లు చేరారు ఇద్దరూ. తండ్రి కొడుకు లిద్దరికోసమూ ఎదురుచూస్తున్నది మూడవ నిర్భాగ్యజీవి ఏశోబు తల్లి.

తల్లి కిచ్చాడు కాయలు రెండూ ఏశోబు. తరిగి తలా ఓ రెండు ముక్కలుతిని నీళ్లుతాగారు. శోషవచ్చినట్లు, ఎవరిపాటికి వాళ్లు పండుకున్నారు శవాల్లా.

దానియేలుకు నిద్రపట్టింది. మగతనిద్ర. కళ్లు తెరిపిడి పడ్డాయి. కడుపులో మంట. ఆకలి దహించేస్తున్నది. 'రేపు' అని ఓ ఆశాకిరణం తలలో మెరిసి మాయమైంది. 'రేపటికి బ్రతికి వుంటేగా? ఎన్ని నీళ్లు తాగితే ఆకలి తీరుతుంది?' కళ్లు మూతలు బడ్డాయి. 'ఇష్టమైతే కుట్టు. అర్ధణాకంటే అధికంగా ఓ పైసా కూడా ఇవ్వను.' పెద్దమనిషి మాటలు చెవుల్లో వినవస్తూన్నాయి. కళ్ల ముందు కానవస్తున్నది తారు రోడ్డు. మామిడి పళ్లు, మంచినీళ్ళు, కాఫీహోటలు, బస్సులు, రిక్షాలు... ఒక్కొక్కటి కళ్లముందు కదులుతూన్నాయి.

అతని కది స్వప్నమన్న. బాహ్య జగత్తుతో సంబంధం లేని ఒక వేదనావస్థ.

దానియేలుకు మరల స్పృహ రాలేదు. ఏదో కలవరించాడు. పలవరించాడు. కలలు కన్నాడు. కండ్లు మూశాడు. మరల తెరవలేదు; తెరిపిడి పడలేదు. ★